


అంది అమ్మ. ఆయన కూర్చుంటూ "ఏం చేస్తా మమ్మా తప్పదు గదా" అన్నాడు అమ్మ మాటలకి జవాబుగా. తర్వాత కొంచెంసేపు మాట్లాడాక వెళ్ళ బోయే ముందు "మీ అబ్బాయ్ ఈ మధ్యన బాగా ఆలస్యంగా ఇంటికి వస్తున్నట్టున్నాడు" అన్నాడు. నాన్న ఎందుకో కొంచెం సీరియస్‌గా ముఖం పెట్టి "ఆ ఏవో మీటింగ్‌లవుతుంటే వింటూ వున్నానం టాడు. ఏం". "అబ్బే ఏం లేదు. రోజులు అసలే బాగో లేదు. ఎందుకు చెప్పండీ ఆ మీటింగ్‌లకీ, వాటికీ మనలాంటి వాళ్ళు. అలా వెళుతున్నాడనే గదా మొన్న ఎదురింటి కుర్రాడ్ని పట్టుకెళ్ళాం" అన్నాడు. "మా వాడు అన్నది అలాంటి వాటి గురించా, నాకు తెలీనే తెలీదు" అన్నాడు నాన్న కంగారు పడుతూ. "తెలిసినా, తెలియకపోయినా రేపు ఏదన్నా జరిగితే ఎవ్వరూ ఏం చెయ్యలేరు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు తర్వాత ఎన్ననుకుని ఏం ప్రయోజనం చెప్పండి" అన్నాడు చేతులు తిప్పతూ. "అలాగే ఇక మా వాడ్ని గుమ్మం కదలద్దని గట్టిగా చెప్తా"నన్నాడు నాన్న. "అదీ ఆ పని చెయ్యండి. ఏదో ఒకే వీధిలో వుంటున్నవాళ్ళం కదా, ఆ పరిచయం కొద్దీ చెప్పా. వస్తానండీ" అని అమ్మకేసి చూసి "వెళ్ళొస్తానమ్మా" అన్నాడు. "ఎప్పుడైనా వస్తూండండన్నయ్యగారూ" అందమ్మ. "అలాగే" అని అతను వెళ్ళిపోయాడు.

నా కెందుకో కొంచెం భయం వేసింది. అమ్మా నాన్నా కూడా అలాగే కనబడ్డారు. నేను నా పుస్తకం మూసేసి బయటకొచ్చి అరుగు మీద కూర్చున్నా. చాలా సేపయింది. అన్నయ్య మాత్రం ఇంకా రాలేదు. రాత్రయింది. అయినా రాలేదు. నేను పడుకోకుండా మేలుకుని వుంటే "అలా కొరివిలా కూర్చోకపోతే పడుకోవచ్చు గదా" అని అమ్మ కసురుకుంది. ఎప్పుడొచ్చాడో అన్నయ్య వచ్చాడు. వాడి కోసమే ఎదురుచూస్తున్న నాన్న అంతెత్తున ఎగిరిపడ్డాడు. అన్నయ్య చేతిలో పుస్త కాలు లాక్కుని విసిరికొట్టాడు. "కూడూ, గుడ్డా పెట్టని ఈ వెధవ పుస్తకాలన్నీ చదవటమెందుకు" అని తిట్టాడు. అన్నయ్య ఏం అనలేదు. భోం చెయ్యకుండా పక్కబట్టలు తీసుకుని మేడపైకి పోతూ అమ్మని చూసి "నువ్వెందుకు పిన్నీ కళ్ళ నీళ్ళు పెట్టుకోవటం, ఇప్పుడేవయిందనీ, ఇది మా ఇద్దరికీ రోజూ వుండే గొడవే కదా" అన్నాడు. అన్నయ్య ఎప్పుడూ అమ్మని 'పిన్నీ' అనే పిలుస్తాడు. ఆ రోజు కూడా అన్నయ్య దగ్గర పడుకోబోతే "అమ్మ దగ్గర పడుకోమ్మా" అన్నాడు. "వూహూం, నీ దగ్గరే పడుకుంటా"నని చేతులు సాచా. ఎత్తు కుని మేడ మీదకి తీసుకెళ్ళాడు. అన్నయ్య లైటు కింద కూర్చుని చదువుతుంటే నేను ఒడిలో తల పెట్టుకుని పడుకున్నా. కానీ, నిద్దర రాలేదు. కళ్ళు తెరిచి చూస్తే అన్నయ్య నాకేసే చూస్తు న్నాడు. నేను కళ్ళిప్పటం చూసి చేత్తో నా చెంప మీద రాస్తూ, "రేపు నేను ఎక్కడికైనా వెళితే ఎలా పడుకుంటావే" అనడిగాడు. నాకు చాలా భయం వేసింది. లేచి కూర్చుని "ఎక్కడకెళ్తావ న్నయ్యా" అన్నా. "ఎక్కడికైనా..." అదో రకంగా వుందన్నయ్య గొంతు. కళ్ళు లైటు వెల్తురులో మెరుస్తున్నాయి. "ఏడవకన్నయ్యా, నువ్వు ఎక్క డికీ వెళ్ళద్దు. నువ్వెళ్ళిపోతే నా కేడుపొస్తుంది" అన్నా. నా కప్పుడే ఏడుపొచ్చేస్తోంది. వెంటనే అన్నయ్య "ఉత్తే అన్నా, నేనెక్కడ కెళ్తా, ఎక్కడికీ వెళ్ళను.పడుకో" అన్నాడు. "మరి నువ్వో" అన్నా. "నేనూను" అంటూ పడుకున్నాడు. ఓ చెయ్యి అన్నయ్య మీదేసి గట్టిగా పట్టుకుని పడుకున్నా. అన్నయ్య నా వీపు చేత్తో మెల్లగా తడుతున్నాడు. అన్నయ్య వుంటేనే వెన్నెల, అన్నయ్య వుంటేనే ఆట, అన్నయ్య వుంటేనే పాట, అన్నయ్య వుంటేనే అన్నీ. అందుకే అన్నయ్య ఎక్కడికీ వెళ్ళకూడదు. మరి కొంచెం గట్టిగా పట్టుకుని నిద్దరోయా.

చాలా సేపయిన తర్వాత "దబదబాదబా చప్పుడూ, ఏవో కేకలు వినిపిస్తుంటే వులిక్కి పడి లేచా. అమ్మానాన్నలతోపాటు చాలామంది మేడ మీంచి చుట్టూ చూస్తున్నారు. వారిలో చాలామంది మధ్యాహ్నం వచ్చిన 'అంకుల్'లానే వున్నారు. వారి చేతిలో సన్నటి కర్రలూ, నల్లటి వేవో భుజాలకి వున్నాయి. వాళ్ళందరూ ఏం వెతు కుతున్నారో తెలీక "ఏంటే" అని అమ్మనడిగా. ఇంతలో 'అంకుల్లాం'టాయన వచ్చి "మీ అన్నయ్య ఎక్కడ కెళ్ళాడు" అని అడిగాడు. అప్పుడుగానీ నాకు తెలీలే వాళ్ళందరూ అన్నయ్యని వెతుకుతు న్నారని. అవునూ అన్నయ్య ఎక్కడకెళ్ళాడు. చాలా కంగారేసింది, భయం కూడా. అమ్మన డిగా "అన్నయ్యేడే" అని. "ఏమోనే ఎక్కడికి పోయాడో" అంది చాలా బాధగా, కొంచెం నిష్టూ రంగా. అంకుల్లాంటి వాళ్ళందరూ వెళ్ళిపోయారు. నాన్న దిగులుగా కూర్చున్నాడు. అమ్మ వంటింట్లో కూర్చుని ఏడుస్తోంది. ఎందుకో నాక్కూడా ఏడు పొచ్చేస్తోంది. అయినా అన్నయ్య రేపు రాత్రికి వచ్చేస్తాడులే అనుకున్నా. కానీ, రాలేదు.

***

ఇది జరిగి చాలా సంవత్సరాలైంది. ఇపుడు మా పెద్దబ్బాయి కూడా వాళ్ళ మావయ్య చది విన పుస్తకాల్లాంటివే చదువుతున్నాడు. ఎప్పుడైనా మావయ్య గురించి చెబితే, "నేను కూడా మావ య్యంత ఎప్పుడవుతానే" అనేవాడు. మావయ్యని చూపించమనేవాడు. ఎలా చూపించను. "వస్తా డులే" అనేదాన్ని. అవును రాక ఎక్కడికి పోతాడు! ఈ చెల్లెల్ని చూడటానికి ఎప్పుడో ఒకప్పుడు రాకుండా వుండడు. అన్నయ్య వస్తే, నా కొడుకుని గర్వంగా చూపద్దూ! అందుకే అన్నయ్య రావాలి. ●